

భీమవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 26.0
తణుకు : 31.0 - 26.0

బడ్జెట్ అదుర్స్

కేంద్ర బడ్జెట్‌లో అందరూ కోరుకున్నట్లే పోలవరం పూర్తి చేసే దిశగా విధాన ప్రకటన వెలువడింది. పట్టణ ప్రాంతాల్లో పక్కా. గృహ నిర్మాణానికి వీలుగా నిధులు కేటాయించనున్నారు. జల జీవన్ మిషన్ కింద తాగు నీరు, 300 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందించేందుకు సమగ్ర ప్రణాళిక.. నిధుల కేటాయింపునకు సిద్ధమైంది. ఇంకో వైపు రైల్వే కోసం ప్రత్యేక ప్రకటన చేయకపోయినా ఏపీలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో అన్నీ పూర్తి చేస్తామంటూ భరోసా లభించింది. ఇప్పటికే రోడ్లు దారుణంగా దెబ్బ తినగా, సడక్ యోజన కింద గ్రామీణ రహదారులకు నిధులు కేటాయించను న్నారు. పార్లమెంట్‌లో మంగళవారం ఆర్థిక మంత్రి నిర్మలమ్మ బడ్జెట్‌పై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కూటమి శ్రేణులు సంతృప్తి వ్యక్తం చేయగా, వామపక్షాలు పెదవి విరిచాయి.



పోలవరం నిర్మాణానికి పూర్తి సానుకూలత



- కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్లకు కదలిక
- ఆక్వా మేతలపై పన్నులు తగ్గింపు.. రొయ్యల సాగుకు మంచి రోజులు
- సడక్ యోజన కింద గ్రామీణ రోడ్ల అభివృద్ధి
- ఆరు శాతం సుంకం తగ్గింపు.. భారీగా తగ్గిన బంగారం ధరలు
- నిర్మలమ్మ బడ్జెట్‌పై కూటమి హర్షం
- వామపక్షాల పెదవి విరుపు

(ఏలూరు/భీమవరం/నరసాపురం-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పోలవరం పూర్తి చేయటానికి వీలుగా కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక ప్రస్తావన చేశారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు తమ సహకారం ఉంటుందంటూ ప్రకటించారు. గడిచిన ఐదేళ్ళుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వీలుగా ఎటువంటి నిధులు కేటాయించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా, ప్రధాని మోదీ చొరవతో కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా ఈ సారి నిర్మాణం పూర్తి చేస్తామంటూ విధాన ప్రకటన చేయడం అందరిని సంతృప్తి పరిచేలా చేసింది. వాస్తవానికి ప్రాజెక్టు నిర్మాణానికి వీలుగా గడిచిన ఎన్నికల్లో గెలిచిన వెంటనే సీఎం చంద్రబాబుతో సహా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్‌తోపాటు రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అప్రమత్తమ య్యారు. కేంద్రంతో సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో ప్రాజెక్టుకు తగినన్ని నిధులు కేటాయించాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీనికి తలొగ్గిన కేంద్రం బడ్జెట్‌లో ప్రత్యేకించి నిధులు ఎంత ఇస్తామో చెప్పకుండానే పూర్తి చేయడానికి సహకరిస్తామని సానుకూల ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో పోలవరం పనులు శరవేగంగా పుంజుకునేందుకే ఇప్పుడు అవకాశం చిక్కింది. గడిచిన ఐదేళ్లు పోలవరం ప్రాజెక్టు పూర్తిగా పడకేసిన నేపథ్యంలో ఇక ఈ ప్రాజెక్టు వట్టిదే అన్నట్లు రైతుల్లో అసంతృప్తి నెలకొంది. దీనిని కూటమి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో పటాపంచలు చేస్తూనే వచ్చింది. ఆ దిశగానే కేంద్ర బడ్జెట్‌లోనూ ప్రాజెక్టును ప్రస్తావించటం సానుకూలతకు దారితీసింది.

రైల్వే పనులపైనా సానుకూలత



కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైనుకు ఎంత మొత్తం కేటాయించింది బడ్జెట్‌లో ఇంకా స్పష్టత రాలేదు. కాని ఏపీలో ఉన్న రైల్వే పనులన్నింటిని పూర్తి చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటిం చారు. దీన్ని బట్టి చూస్తే ఈ లైన్‌కు ఈసారి కేటాయింపులు ఘనంగానే ఉండబోతున్నాయని భావిస్తున్నారు. ఈ లైన్ నిర్మాణానికి ఎందరో ఆశలు పెంచుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి ఎంపీలు శాఖల వారీగా పని విభజన చేసుకుని ఆ మేరకు కేంద్రంపై వత్తిడి తెచ్చేందుకు ముందుగానే వ్యూహాత్మకంగా కదిలారు. దీంతో ఈ పెండింగ్ పనులు అన్ని ఒకదాని వెంట మరొకటి ముందుకు సాగుతా యన్న ఆశ నెలకొంది. కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఏ లైన్‌కు ఎంత కేటాయిస్తున్నారనేది ఆర్థిక మంత్రి తన ప్రసంగ పాఠంలో వివరించనప్పటికి రైల్వే బడ్జెట్ వివరాలు బహిర్గతం అయినప్పుడే కేటాయింపులు ఎంత మేర జరిగాయి అనేది తేలబోతోంది. అలాగే కోటిపల్లి-నరసాపురం రైల్వే పనులకు పెద్ద మొత్తంలో కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కోటిపల్లికి రూ.400 కోట్లు కేటాయించారు. ఆ నిధులు పెండింగ్ బిల్లుల చెల్లింపులకే సరిపోతుండడంతో ఇంకా నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు కేంద్రానికి పంపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు ఎంత మొత్తంలో కేటాయించారన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది. షెడ్యూల్ ప్రకారం నరసాపురం నుంచి కోటిపల్లి వరకూ చేపట్టిన 57 కిలోమీటర్ల కొత్త రైల్వేలైన్ పనులు 2021 నాటికి పూర్తి కావాలి. ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 20 శాతం వాటా మొత్తం చెల్లించకపోవడంతో ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.2,250 కోట్ల అంచనాతో చేపట్టిన పనుల వ్యయం పెరిగింది. ప్రస్తుతం విశాఖపట్నం-విజయవాడ మెయిన్‌లైన్‌లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త రైళ్లను నడపలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కారణంగా కోటిపల్లి లైన్‌కు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించే అవకాశం ఉంది. ఎంత మొత్తమనేది బుధవారం విడుదల కానుంది.

దిగమర్రు 165కు నిధులు

ప్రతిపాదనలో వున్న జాతీయ రహదారులను పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి బడ్జెట్‌లో ప్రకటించారు. ఈ లెక్కన పశ్చిమ గోదావరి జిల్లా దిగమర్రు నుంచి ఆకివీడు వరకూ ప్రతిపాదించిన 165 జాతీయ రహదారికి క్లియరెన్స్ దక్కినట్లు భావించవచ్చు. రూ.1,000 కోట్లతో ప్రతిపాదనలను ఎన్‌హెచ్ అధికారులు కేంద్రానికి పంపారు. వీటిని క్లియర్ చేస్తామని బడ్జెట్‌లో చెప్పడంతో దిగమర్రు-ఆకివీడు నాలుగు లైన్‌ల రహదారికి మోక్షం లభించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు. దీనిపై నేడో, రేపో పూర్తి స్పష్టత రానుంది.



స్టాంప్ డ్యూటీలో చిత్ర విచిత్రం

రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వాలు విధించే స్టాంప్ డ్యూటీల్లో కొంత మేర పెంచేందుకు వీలుగా కేంద్ర బడ్జెట్‌లో మరొక కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీని పెంచేందుకు అనువుగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటికే ఆర్థిక ఒడిదుడుకుల్లో ఉన్న ప్రభుత్వాలకు ఇది కొంత ఊరట. ఇదే తరుణంలో స్టాంప్ డ్యూటీ పెంచితే ఆ భారమంతా ప్రజల మీదే పడుతుంది. ఈ లెక్కన రియల్ ఎస్టేట్, ఇతర రిజిస్ట్రేషన్‌లో కొంత పుంజుకోగ లవని, ఇప్పటికే అంచనా వేస్తుండగా, తాజా నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అయితే ఒక వైపు పెరుగుదలను చూపిస్తూనే, ఇంకోవైపు మహిళల పేరిట అయ్యే రిజిస్ట్రేషన్‌కు మాత్రం స్టాంప్ డ్యూటీని తగ్గిస్తూ మరో కీలక ప్రకటన చేశారు. అంటే ఒకవైపు పెంచుతూనే ఇంకో వైపు మహిళలకు మినహాయింపు ఇవ్వడం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇది కాకుండా రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్‌లో సముచిత ప్రాధాన్యత ఇవ్వడం పట్ల ఇంకొందరు సంతృప్తిగానే ఉన్నారు.

ఆక్వాకు ఊరట..



బడ్జెట్‌లో ఆక్వా రంగానికి చేయూతనిచ్చారు. పన్ను తగ్గించడంతో మేతల ధరలు తగ్గనున్నాయి. ఇవి భారీగా ధరలు పెరిగిపోవడంతో గడచిన ఐదేళ్ల ఈ రంగం గడ్డు కాలాన్ని ఎదుర్కొంది. రొయ్య మేత రూ.93 వేలకు చేరింది. దీనికితోడు విద్యుత్ చార్జీలు, పరికరాల ధరలు ఐదింతలు పెరిగాయి. రొయ్య పిల్ల ధర బెంబేలెత్తించింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో సాగు విస్తీర్ణం సగానికి పడిపో యింది. కేంద్ర బడ్జెట్‌లో మేతపై ఐదు శాతం పన్ను తగ్గించడంతో మేత ధరలు తగ్గుముఖం పట్టనున్నాయి. మరోవైపు తల్లి రొయ్య దిగుమతులపైనా సుంకాన్ని తగ్గించారు. తద్వారా రొయ్య పిల్ల ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు. రొయ్యల ధరలు పెరిగే సూచనలు కనిపి స్తుండడంతో సాగు మళ్లీ లాభాల బాటలో పయనించనుంది. ఎన్నికల ముందే ఎన్డీయే కూటమి నేతలు రాష్ట్రంలో ఆక్వా రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కేంద్రస్థాయిలో సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు రాష్ట్రంలోనూ అదే రకమైన నిర్ణయాలు అమలు చేస్తే ఆక్వా మరింత ఊపు ఏర్పడనుంది. రైతులకు ఊరట లభించనుంది. విదేశీ మారకద్రవ్యం లభించనుంది. పశ్చిమ గోదావరి ఏలూరు జిల్లాల్లో రొయ్యలు, చేపల సాగుపై ఆధారపడే రైతులు, కార్మికులు, పరిశ్రమలకు ఊతం ఏర్పడుతుంది. ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుంది. చేపల మేత కూడా రెట్టింపయ్యింది. గతంలో రూ.1.20 లక్షలకు లభ్యమయ్యే డీవోడీ ఇప్పుడు రూ.2.50 లక్షలకుపైనే పలుకుతోంది. మరోవైపు చేప ధరలు పతనమయ్యాయి. గిట్టుబాటు కావడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆక్వా రంగానికి పెద్ద పీట వేయడంతో స్థానిక రైతులు ఆనందపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిస్తున్నారు.

• ఏపీకి ఊపిరి పోసిన కేంద్ర బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సహాయన్ని ప్రకటించడం, పోలవరం ప్రాజెక్టుకు 200 టీఎంసీల నీటి నిల్వ సామ ర్థ్యంతో పూర్తి నిర్మాణ ఖర్చును భరిస్తామని ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్రానికి ఊపిరి పోసిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ధన్యవాదాలు.

- సీతారామలక్ష్మి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు

• కాకుల్ని కొట్టి గద్దలకు పెట్టి..



బడా కార్పొరేట్లకు, విదేశీ కార్పొరేట్లకు టాక్సుల రాయితీలు ఇచ్చి వేలు, లక్షల కోట్లు దోచి పెట్టారు. నిత్యావసర వస్తువుల ధరల అదుపునకు చర్యలు లేవు. పెట్రోల్, డీజిల్, ఎరువులు, పురుగు మందుల ధరల తగ్గింపు లేదు. రైతుకు గిట్టుబాటు ధర, ధరల స్థిరీకరణ, రైతుల రుణభారం తొలగింపు, గ్రామీణ ఉపాధి పథకం వంటి వాటి మాటేలేదు. మూతపడిన పరిశ్రమలపై చర్యలు లేవు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకాన్ని నిలుపుదల చేస్తామన్న ప్రకటన లేదు. పోలవరానికి ఎన్ని నిధులు, ఎప్పుడు ఇస్తారో, ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తారో ప్రకటించలేదు.

- బి.బలరాం, సీపీఎం జిల్లా కార్యదర్శి

• రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం



ఎన్డీఏ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే విధంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి బాధ్యత, రాజధాని అమరాతి నిర్మాణానికి భారీగా నిధులు కేటాయింపు ప్రకటన, వెనుకబడిన జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని పెట్టడం హర్షణీయం.

- టి.రామలింగేశ్వరరావు, జనసేన జిల్లా కో ఆర్డినేటర్

• మదుపుదారులు డీలా



పెట్టుబడుల లాభాలపై వేస్తున్న పన్నును ఎత్తి వేస్తారని మదుపుదారులు ఎదురుచూశారు. దానికి విరుద్ధంగా జరగడంతో మదుపుదారులు డీలా పడ్డారు. ఉన్న పన్నును పెంచకుండా ఉంచినా.. బాగుండేది. ఇప్పుడిప్పుడే చాలా మంది మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్నారు.

- రవికుమార్, స్టాక్ బ్రోకర్, నరసాపురం

• పన్ను చెల్లింపుదారులకు నిరాశ



ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఆశాజనకంగా లేదు. స్టాండర్డ్ డిడక్షన్ 50 వేల నుంచి 75 వేలకు పెంచారు. లక్షన్నర వరకైనా పెంచాల్సింది. డిడక్షన్ టీచర్లకు పెన్షన్ రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు పెంచారు. పన్ను చెల్లించే వారికి ఈ స్లాబ్ రేట్లు ఉపయోగకరం కాదు.

- ఐ.రాజగోపాల్, ఏపీటీఎఫ్ పూర్వ కార్యదర్శి

తగ్గనున్న పసిడి ధరలు



బంగారం, వెండిపై వున్న 15 శాతం సుంకాన్ని ఆరు శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో మంత్రి ప్రకటించారు. దీనివల్ల విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం ధరలు తగ్గుతాయి. గడిచిన మూడేళ్ల నుంచి పసిడి, వెండి ధరలు ఆల్ టైం రికార్డు ధరలతో దూసుకుపోతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు గ్రాము బంగారం కొనాలంటేనే జంకుతున్నారు. సుంకం తగ్గించడంతో మంగళవారం పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. మేలిమి బంగారం గ్రాముకు రూ.250 తగ్గింది. సోమవారం గ్రాము బంగారం రూ.7,420 ఉండగా.. బడ్జెట్ తర్వాత రూ.7,180కి దిగింది. వెండి కేజీకి రూ.5 వేలు తగ్గింది. గత వారం రూ.92 వేలు ఉండగా.. మంగళవారం సాయంత్రం రూ.87 వేలకు దిగింది. ధరలు పతనమవడంతో వినియోగదారుల్లో ఆనందోత్సాహం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో ఇవి మరింత తగ్గుతాయనే ఆశతో ఉన్నారు.

స్టాక్ మార్కెట్ మదుపుదారులకు షాక్



స్టాక్ మార్కెట్ మదుపదారులకు బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ షాక్ ఇచ్చారు. ఏ పన్నును ఎత్తి వేయాలని మదుపుదారులు ఆశించారో.. దాన్నే పెంచి కంగు తినిపించారు. ఇప్పటి వరకు స్వల్పకాలిక పెట్టుబడులపై వచ్చిన లాభంపై 15 శాతం పన్ను ఉండేది. దాన్ని 20 శాతానికి పెంచారు. దీర్ఘకాలిక పెట్టుబడులపై వచ్చిన లాభంపై పది శాతం ఉండే పన్ను 12.5 శాతానికి పెంచారు. ప్రస్తుతం బ్యాంకు వడ్డీలు తగ్గడంతో చాలా మంది మదుపుదారులు మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. ఈ తరుణంలో ఈ పన్ను విధించడంతో వీరంతా డీలాపడ్డారు.

ఉన్నత విద్యకు బ్యాంకు రుణాలు



ఉన్నత విద్య చదువుకున్న వారికి బ్యాంకులు రుణాలు చెల్లించాలంటే ఇంతకు ముందు ముప్పుతిప్పలు పెట్టేవి. ఈసారి బడ్జెట్‌లో ఉన్నత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వరాలు ప్రకటించింది. ఉన్నత విద్యనభ్యసించాలనుకునే వారికి రూ.10 లక్షల మేర రుణం కల్పించేందుకు కేంద్రం సమ్మతించించడంతో విద్యార్థి లోకానికి తీపి కబురు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



సడక్ యోజన పథకం క్రింద దేశవ్యాప్తంగా దాదాపు 25 వేల గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి వీలు కల్పించింది. రాష్ట్రాల వారీగా దెబ్బ తిన్న రోడ్లకు ప్రతిపాదనలు రప్పించుకుని ఆ మేరకు కేంద్రం నిధులు విడుదల చేస్తుంది. ఈ సారి ఏపీలో ఎంపీల చొరవ ఒక అడుగు ముందుగానే ఉండటంతో రోడ్ల మరమ్మతులకు వీలుగా అధిక నిధులు రాబట్టే అవకాశం ఉంది.



ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

నా మాట మృదువే కాని..

తప్పు చేసే అధికారులపై చర్యలు స్ట్రాంగ్ : కలెక్టర్

ఆచంట, జూలై 23 : ప్రధాన రహదారులపై ఎక్కడైనా చెత్త ఉంటే సహించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను హెచ్చరించారు. మంగళవారం కోడేరు వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. గోదావరి వరద ఉధృతి తగ్గే వరకు లంక, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి ఉధృతి పెరుగుతున్నప్పటికి, రెండు రోజుల్లో ప్రవాహం తగ్గే అవకాశం ఉందన్నారు. లంక గ్రామాల్లో ప్రజలు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గోదావరి వరద సహాయక చర్యల్లో ఎక్కడైనా లోటు కనిపిస్తే ఆయా శాఖల అధికారులు, సిబ్బంది బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తన మాట మృదువుగా ఉన్నప్పటికి, తప్పు చేస్తే చర్యలు స్ట్రాంగ్‌గానే ఉంటాయని అధికారులను హెచ్చరించారు. లంచాలు తీసుకుంటున్నారనే మాట ఎక్కడా వినపించకూడదని, అలా జరిగితే ఉపేక్షించేది లేదని చురకలు అంటించారు. వరద సమయంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఏటిగట్లను పర్యవేక్షిస్తూ బలహీనంగా ఉన్న చోట్ల మరమ్మతులు చేయాలని సూచించారు. లంకవాసులకు నిత్యావసర సరుకులు అందించలేదని మాజీ సర్పంచ్ పెచ్చెట్టి సుబ్రహ్మణ్యం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సమీక్షలో ఫ్లడ్ ప్రత్యేకాధికారి బి.పిచ్చయ్య, తహసీల్దార్ ఐపీశెట్టి, ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అక్కడ తగ్గి.. ఇక్కడ పెరిగి

వరద తగ్గినా ముంపులోనే గ్రామాలు..చేలు - 7లో

ఎంపీడీవో అదృశ్యం విషాదాంతం

- వారం నుంచి గాలింపు.. ఏలూరు కాల్వలో మృతదేహం లభ్యం
- కానూరులో అంత్యక్రియలు
- ఎమ్మెల్యే నాయకర్ నివాళి.. ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగుల సంతాపం..

నరసాపురం రూరల్, జూలై 23 :

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యం.. విషాదాంతాన్ని మిగిల్చింది. విజయవా డలోని ఏలూరు కాల్వలో ఆయన మృతదేహం మంగళవారం లభ్యమైంది. వారం రోజులుగా ఆయన ఆచూకీ లేకపోవడంతో ఎక్కడో చోట క్షేమంగా ఉన్నారని అంతా భావించారు. చివరకు ఇలా చనిపోవడంతో అందరినీ కలిచి వేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో గత వారం రోజులుగా ఇదే చర్చ నడిచింది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సైతం ఎంపీడీవో కుటుంబీకులతో మాట్లాడి ధైర్యం కల్పించారు.

ఎంపీడీవోగా వచ్చి.. ఇలా బలై..

ఎన్నికల సమయంలో నరసాపురం ఎంపీడీవోగా వచ్చిన వెంకటరమణ ఇక్కడ పనిచేసింది కేవలం ఐదు నెలలు. ఆయన మంచితనంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ, సచివాలయం, మండల పరిషత్ ఉద్యోగులతోపాటు ప్రజలకు దగ్గరయ్యారు. మరో ఆరు నెలల్లో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ రావడం.. నరసాపురం రేవు పాట ముగియడం ఆయన ప్రాణాల మీదకు వచ్చింది. అప్పటి వరకు రేవును నిర్వహించిన పాటదారుడు రెడ్డప్ప ధవేజీని కొనసాగించారు. రేవు నిర్వహణదారు రోజు వారి సొమ్మును చెల్లించకపోవడంతో రెండు నెలలుగా ఎంపీడీవో ఎంతో మానసిక ఒత్తిడికి గురయ్యారు. ఎప్పుడు ఫోన్ చేసినా.. నిర్వహణదారుడు సమాధానం ఇచ్చేవాడు కాదు. రెండు, మూడుసార్లు ఆయన ఇంటికి వెళ్లి బాకీ కట్టాలని వేడుకున్నారు. పలుమార్లు నోటీసులు ఇచ్చి, జేఏసీ కమిటీ సమక్షంలో ఫోన్ చేసినా నిర్వహణదారు బకాయి చెల్లించలేదు. దీంతో మానసిక ఒత్తిడికి గురై ఈ నెల మొదటి వారంలో సెలవుపై వెళ్లిపోయారు. తర్వాత పెనమలూరు మండలం కానూరులోని తన ఇంటి నుంచి బయటకు వెళ్లి.. ఏలూరు కాల్వలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికే ఆయన తన బాధను వ్యక్తం చేస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేరిట ఒక లేఖను కూడా రాశారు. ఇందులో పాటదారుడు రెడ్డప్ప ధవేజీ, మాజీ ఎమ్మెల్యే ముదునూరు ప్రసాదరాజుల పేర్లను ప్రస్తావించారు. తన ఆత్మహత్యకు వాళ్లిద్దరే కారణమని పరోక్షంగా ప్రస్తావించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఏలూరు కాల్వలో గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు మంగళవారం ఉదయం భౌతికకాయాన్ని కనుగొన్నారు. కుమారులు సాయిరాం, మహీధర్ ఘటనా స్థలానికి వెళ్లి తమ తండ్రి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.



నరసాపురంలో ఉద్యోగుల నివాళి (ఇన్‌సెట్) వెంకటరమణ

ఎమ్మెల్యేల నివాళి..

అసెంబ్లీ సమావేశాల్లో వున్న నరసాపురం, పెనమలూరు ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, బోడె ప్రసాద్, ఎంపీడీవో మృతదేహం లభ్యమైందన్న సమాచారం తెలుసుకున్న వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఎంపీడీవో మృతి సమాచారం తెలిసిన ప్రజా ప్రతినిధులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది నరసాపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో వీరభద్రరావు, శర్మ, నాగేశ్వరరావు, శ్రీరామ్, సురేష్, సిబ్బంది సంతాపం తెలిపారు.

చర్యలు తీసుకోవాలి..

ఎంపీడీవో మృతికి కారుకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు డిమాండ్ చేశారు. రేవు నిర్వహణదారు ధవేజీ, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆయనను తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేశారని, ఈ కారణంగానే ఎంపీడీవో ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. మంచి అధికారిని కోల్పోవడం బాధాకరమని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆహార పొట్లాల పంపిణీ

భీమవరం టౌన్, జూలై 23 : కష్టాలు వచ్చినప్పుడు సమైక్యంగా పని చేయడం మానవ ధర్మమని డిప్యూటీ కలెక్టర్ కృష్ణారెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం మెంటేవారి తోటలోని 300 మంది ముంపు బాధితులకు పులిహోర పొట్లాలను అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దాత దంతులూరి జగన్నాథ రాజు సత్రం వంశ పారంపర ధర్మకర్త మంతెన రామ్ కుమార్ రాజు సౌజన్యంతో 300 మందికి పులిహోర అందించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకన్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి మొక్కు తీర్చుకున్న బాబి



వీరవాసరం (భీమవరం టౌన్) జూలై 23 : జనసేన అధినేత పవన్ కల్యాణ్ గెలుపొందిన నేపథ్యంలో పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు (బాబి) మంగళవారం వీరవాసరం మండలం నందమూరు గరువులోని రామ భక్త ఆంజనేయ స్వామి ఆలయంలో జన సైనికులతో కలిసి 108 కొబ్బరికాయలు కొట్టి తన మొక్కును తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎంపీటీసీలు ఆరేటి వాసు, తాతపూడి రాంబాబు, పిల్లానారాయణమూర్తి, చల్లా రాము, కొప్పునీడి బాబి, రాట్నాల శ్రీనివాసరావు, మాదాసు సాయి, పోకల కిషోర్, కొడవటి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

భీమవరం బార్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

భీమవరం క్రైం, జూలై 23 : భీమవరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం మంగళవారం నాడు ఘనంగా జరిగింది. అధ్యక్షులుగా ఏలేటి న్యూటన్, ఉపాధ్యక్షులుగా కె.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా అడపాల ప్రసన్నకుమార్, జాయింట్ సెక్రటరీగా జవ్వాది సత్యనారాయణ, లైబ్రేరీ సెక్రటరీగా కందికట్ల నాగరాజు, ట్రెజరర్‌గా పరాలరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా హరి, లేడీ రిప్రజంటేటివ్‌గా భాగ్యలక్ష్మీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్‌గా గూడూరు వెంకటేశ్వరరావు, మద్దాల హరిచంద్రుడు, బోడిగడ్డ సునీల్, సౌజన్య, మట్టా చంద్రశేఖర్‌బాబు, వంశీ, శ్యామల ప్రమాణస్వీకారం చేశారు.

కోడి రామకృష్ణ జయంతి



కోడి రామకృష్ణకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్, జూలై 23 : ప్రముఖ రంగస్థల కళాకారుడు, నటుడు, దర్శకుడు కోడి రామకృష్ణ జయంతిని పట్టణంలోని కోడి రామకృష్ణ థియేటర్ మారుతీ సినిమా థియేటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణ వర్మ, వంగా నరసింహారావు, మేడికొండ శ్రీనివాసరావు చౌదరి, మానాపురం సత్యనారాయణ జక్కంపూడి కుమార్, కొండ ప్రసాద్, వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు ముంపు పొలాల పరిశీలన

ఆచంట, జూలై 23: ఆచంట వేమవరంలో నీట మునిగిన పంట పొలాలను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ వేమవరంలో పంట పొలాలు ఏటా నీట మునగడంతో రైతులకు సార్వా పంట నష్టాలు తప్పడం లేదని ఒకటికి రెండు సార్లు నాట్లు వేయాల్సి వస్తుందని ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ దృష్టికి వెళ్ళి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిషాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు దాసం బాబి, మండల పార్టీ అధ్యక్షుడు ఎం. నాగ సుబ్బారావు, పులపర్తి నాగరాజు , కొత్త బాస్కర నాగ భూషణం ఉన్నారు.

డీఎన్ఆర్‌లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

పాలకొల్లు అర్బన్, జూలై 23 : స్థానిక డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ, ఇంగ్లీషు సబ్జెక్టులు బోధించడానికి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు ఆయా సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, స్లెట్ పాసైన వారికి ప్రాధాన్యం కల్పించబడునని ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హులైన వారు ఈనెల 29వతేదీ లోపుగా దరఖాస్తు చేసుకుని, 30వ తేదీ ఉదయం 10గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

అంగన్ వాడీ కేంద్రాల్లో బాలసంజీవిని పంపిణీ

పాలకొల్లు అర్బన్, జూలై 23 : మండలంలోని దగ్గులూరు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు బాలసంజీవిని కిట్లను మంగళవారం పంపిణీ చేశారు ఈసందర్భంగా మండల పరిషత్ ఫ్లోర్‌లీడర్ శాగా సత్యనారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్ చల్లా శ్రీదేవి, గ్రామస్తులు అందె వీర భద్రం, కలిదిండి రామచంద్రరాజు, విశ్వనాధం పేరయ్య, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు జీవనభృతి అందించాలి



మొగల్తూరు, జూలై 23: వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇవ్వాల్సిన రెండు నెలలు జీవనభృతిని తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పేరుపాలెంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు వొడుగు శ్రీను, జల్లి రామ్మోహనరావు మాట్లాడుతూ ఈ ఏడాది వేట నిషేధ కాలం ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకూ రెండు మాసాలకు గానూ నెలకు రూ.10వేలు చొప్పున రూ.20వేలు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందన్నారు. ఆసమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రభుత్వం నిషేధ కాల జీవన భృతి ఇవ్వలేదన్నారు. మండలంలో 698 కుటుంబాలు జీవనం సాగించేందుకు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కుష్ఠు నివారణకు సర్వే

మొగల్తూరు, జూలై 23: కుష్ఠువ్యాధి నివారణకు చేపట్టిన సర్వే మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతుందని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు దినేష్, లక్ష్మీపార్వతి తెలిపారు. రాగి, గోధుమ రంగులో ఉండి, తిమ్మిరి, లేదా స్పర్శ లేకపోవడం చెమటపట్టకపోవడం, తిమ్మిరి వచ్చినా తెలియకపోవడం తదితర లక్షణాలుంటాయన్నారు. ఇంటింట సర్వేలో అనుమానితులను గుర్తించి ఆసుపత్రికి రిఫర్ చేస్తారన్నారు.

చినకాపవరం కాల్వలో తూడు తొలగింపు

ఆకివీడు, జూలై 23 : ఏళ్ళతరబడి ఉన్న సమస్యను ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు సౌజన్యంతో పరిష్కారం కావడంతో సమతానగర్ రైతులు ఆనందం వ్యక్తం చేశారు. చినకాపవరం మురుగు కాల్వలో తూడు, గుర్రపుడెక్క, వ్యర్థాలతో పూడుకుపోవడంతో ప్రతీఏటా సమతానగర్ ప్రాంతంలోని పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఎమ్మెల్యే చేపట్టిన సహాయ నిధి ద్వారా మంగళవారం తూడు తొలగింపు పనులు చేపట్టారు. టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్,బొల్లా వెంకట్రావు, గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు పర్యవేక్షించారు.

త్వరలోనే అన్న క్యాంటీన్లు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 23: త్వరలోనే రాష్ట్రమంతా అన్న క్యాంటీన్లు ప్రారంభమవుతాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. మంగళవారం పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలోని అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వాడపల్లి సుబ్బరాజు కుమారుడు వెంకట చంద్రశేఖర్ వర్మ పుట్టిన రోజు సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం దాతలను సత్కరించారు. పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, గంధం సతీష్, వర్తనపల్లి కాశి, బండి పెద్దిరాజు, ముత్యాల సత్యనారాయణ, రామ్‌లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, జూలై 23: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 25న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. చిన్నపిల్లలు, స్త్రీలు, క్యాన్సర్, జనరల్, గుండె సంబంధ వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు ఈసీజీ, టూడీ ఎకో, ఆల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలంతా వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.









యండగండిలో నిండుగా ప్రవహిస్తున్న డ్రెయిన్.. పిప్పరలో ముంపు సర్వే చేస్తున్న అధికారులు.. భీమవరంలోని యనమదుర్రులో తూడు, గుర్రపుడెక్క, తొలగిస్తున్న దృశ్యం.. రామ్ లక్ష్మణ్ నగర్‌లోకి వెళ్తున్న లోసరి చానల్ నీరు

ఉధృతంగా కాల్వలు

ముంపులోనే కాలనీలు, పొలాలు

ఉండి జూలై 23: యనమదుర్రు డ్రెయిన్, ఉండి పంట కాల్వలు ఉగ్రరూపం దాల్చడంతో యండగండి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మంగళవారం యండగండిలోని పలు వీధులు జలమయమయ్యాయి. సాగపాడు వద్ద పంటకాలువ కోతకు గురికావడంతో నీరు చేలలోకి చేరి యండగండి ప్రాంతంలోకి ఉధృతంగా చేరుతుంది. ఉండి పంటకాలువకు, యనమదుర్రు డ్రెయిన్ మధ్యగా గ్రామం వుండడం, మరొక పక్క ఉండి పంటకాలువ కోతకు గురై ఉధృతంగా దళితవాడ, జగన్ననకాలనీ, శివాలయం ప్రాంతంలోని జగన్నన కాలనీలలోకి వరదనీరు ప్రవేశిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. యండగండి నుంచి ఎస్‌కొండేపాడు వెళ్లే ఆర్అండ్‌బి రహదారి తిమ్మరాజుకాలనీ నుంచి వరదనీరుతో మునిగిపోయింది.

ఇరగవరం: వానలు తగ్గినా పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలోని రేలంగి, ఇరగవరం, అర్జునుడుపాలెం, కావలిపురం, గోటేరు, కె. ఇల్లిందలపర్రు తదితర చోట్ల పంట పొలాలు నీట మునిగాయి. ఒక్కో ఎకరానికి రూ. 15 వేలు పెట్టుబడి పెట్టామని ఇది మొత్తం బూడిదలో పోసిన పన్నీరేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు తగ్గినచోట పొలాలను పరిశీలిస్తే నాట్లన్నీ కుళ్లిపోయాయని, అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

పాలకోడేరు: మొగల్లు శివారు గుత్తులవారిపాలెంలో గొస్తని నది పొంగి వందలాది ఎకరాలు నీటిలో మునిగి ఉన్నాయి. అదే కోవలోనే పాలకోడేరులోని రాయకుదు పంటబోదెకి ఉన్న డ్యాంలు పాడయ్యి వాటిలోని వరదనీరు పంటపొలాల్లోకి చేరడంతో గ్రామంలోని పడమటి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అదే విధంగా పెన్నాడపాలెంలోని కూరగాయపంటలు నీరు నిల్వ ఉండి పాడవుతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. ఇలా ఏ గ్రామంలో చూసినా రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది.

గణపవరం: యనమదుర్రు వరదలకు గణపవరం మండలంలోని ఎస్.కొండేపాడు, పిప్పర కాలనీ ఇంకా ముంపు నుంచి తేరుకోలేదు. ఎస్.కొండేపాడులో జగనన్న కాలనీ వరద ముంపునకు గురైంది. పిప్పరలో బీసీ కాలనీ, విద్యుత్ ఉపకేంద్రం ప్రాంతాల్లో ఇంకా జలదిగ్బంధంలోనే కాలనీ వాసులు కొట్టుమిట్టాడుతున్నారు. యనమదుర్రు డ్రెయిన్ షట్టర్లు లేకపోవడంతో ఈ ముంపు బారిన పడాల్సి వచ్చిందని బాధితులు ఆరోపించారు. సుమారు 30 కుటుంబాల వారు స్థానిక ఉన్నత పాఠశాలలో, పున రావాస కేంద్రంలో తలదాచుకుంటున్నారు. యనమదుర్రు డ్రైన్ ఇంకా పొంగి పొర్లుతూనే ఉంది. ఎగువ నుంచి వస్తున్న వరద యనమదుర్రు డ్రైన్‌లో కలుస్తోంది. డ్రెయిన్ నీటిమట్టం తగ్గితే ముంపులో ఉన్న వరి చేలు బయటపడతాయని రైతులు భావిస్తున్నారు.

భీమవరం టౌన్: భీమవరంలో యనమదుర్రు డ్రెయి ఇంకా ఉధృతంగానే ప్రవహిస్తోంది. దీని కారణంగా మెంటేవారితోట, దుర్గాపురం, లంకపేట ప్రాంతాలు నీటి మునిగిఉన్నాయి. ఈ ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు ఆయిల్ ఇంజన్‌లను ఏర్పాటచేసి నీటిని తోడుతున్నారు. అదే విధంగా లోసరి ఛానల్ నుంచి నీరు కూడా గట్లవెంబడీ బయటకు రావటంతో రామ్‌లక్ష్మణ్ నగర్‌లలోకి వెళ్ళటంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. యనమదర్రు డ్రైన్‌లో వచ్చిన గుర్రపు డెక్క, తూడు ఫుట్ పాత్ వంతెకు సంబంధించి పిలర్స్ వద్ద భారీగా నిలచిపోవటంతో ప్రవాహానికి ఆటంకంరావటంతో అధికారులు దానిని తొలగించారు.

పితాని కాలనీవాసులకు ముంపు తిప్పలు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం గరువు గ్రామపంచాయతీ పరిధిలో పితాని సత్యనారాయణ కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. కాలనీగా ఆనుకుని ఉన్న గోస్తనీ నది పొంగి ప్రవహించడంతో కాలనీలోకి మురుగునీరు చేరింది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మోకాళ్ల లోతు నీటిలో రాకపోకలు సాగిస్తున్నారు. కాలనీలో రహదారుల నిర్మాణం చేసి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధిక వర్షాలకు గోస్తనీ నది, భగ్గేశ్వరం, గొంతేరు డ్రెయిన్ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 1200 ఎకరాలు నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురయ్యాయి 500 ఎకరాల నారుమళ్లు వారం రోజులుగా మునిగిపోయాయి నేటికీ ముంపు తీయకపోవడంతో మో కాళ్ళ లోతు నీటిలోనే పొలాలు చెరువులను తలపించే విధంగా ఉన్నాయి. నారుమళ్లు కుళ్లిపోతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో మళ్లీ నారుమళ్లు పోయాలంటే ఇప్పటికే ఎకరాకు పదివేలు చొప్పున పెట్టుబడులు పెట్టామని ఆవేదన చెందుతున్నారు.

నంది నాటక న్యాయ నిర్ణేత సత్యనారాయణకు సన్మానం



పాలకొల్లు అర్బన్, జూలై 23 : నంది నాటక న్యాయ నిర్ణేత, పాత్రికేయుడు మానాపురం సత్యనారాయణను మంగళవారం ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. మూడుసార్లు నంది నాటకోత్సవాలకు సత్యనారాయణ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకట రమణ, కార్యదర్శి ఎంఎస్‌వి సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

పెనుగొండ, జూలై 23: ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి దోమలకు ఆవాసాలుగా మారాయి. ఈ సందర్భంగా వడలి గ్రామంలో పలు కాలనీల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి కుంటలలో దోమల లార్వా పెరగకుండా పంచాయతీ సిబ్బందిచే ఆయిల్ బాయిల్స్ వేయించారు.

వడలిలో రోడ్లు మెరక పనులు



పెనుగొండ, జూలై 23: వడలి గ్రామంలో ముంపు వీధులను గుర్తించి గ్రామంలో మొత్తం 11 రోడ్లను మెరక చేసే పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ రోడ్లను 15వ ఆర్థిక సంఘం నిధులు, గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

డ్రెయిన్‌లో చెత్త తొలగింపు



పాలకొల్లు టౌన్, జూలై 23: భారీ వర్షాలకు పాలకొల్లు పట్టణంలోని బెజవాడ కోడు డ్రెయిన్ చెత్తాచెదారంతో నిండిపోయింది. దీనితో నీటి పారుదల లేక నీళ్ల రోడ్డుపైకి వచ్చేసి ఏరియా అంతా ముంపు ప్రాంతంగా తయారయ్యింది. సమస్యను తెలుసుకున్న రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తక్షణ చర్యలుగా మునిసిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పూర్తిస్థాయిలో చెత్త తొలగింపు పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలుగా ఎక్స్‌కేటర్ యంత్రం సాయంతో డ్రెయిన్‌లో చెత్త తొలగింపు పనులు చేపట్టారు.

ఘనంగా తిలక్, ఆజాద్ జయంతి



భీమవరం అర్బన్, జూలై 23:ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి స్వాతంత్ర్యం రావడానికి కృషి చేసిన వీరులను స్మరించుకోవాలని భీమవరం ఉప ఖజానా అధికారి అల్లూరి రవి వర్మ అన్నారు. విజ్ఞాన వేదిక అధ్యక్షులు అల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర తిలక్, విప్లవవీరుడు చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద అమరవీరుల స్మృతివనంలో నివాళులు అర్పించారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి రవి వర్మ, సభ్యులు గాతల జేమ్స్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, చాన్‌బాషా సూర్యనారాయణ పాల్గొన్నారు.

పీవీఆర్ జన్మదిన వేడుకలు



హైస్కూలులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఇరగవరం, జూలై 23: బీజేపీ నాయకుడు, గ్రీన్ ఏషియా ఇన్‌పెక్స్ సంస్థల అధినేత పసుపులేటి వెంకట రామారావు (పీవీఆర్) జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మిత్రులు, అభిమానులు మంగళవారం రేలంగిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ సౌజన్యంతో గ్రామంలో జడ్పీ హైస్కూలులో లయన్స్ క్లబ్ గవర్నర్ గట్టు మాణిక్యరావు చేతుల మీదుగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు అందించారు. అనంతరం మిత్రుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. రేలంగికి చెందిన చొప్పర్ల కృష్ణ భార్య శస్త్రచికిత్సకు పీవీఆర్ రూ. 20 వేలు అందించారు. జనసైనికుడు ముత్యాల అంజినాయుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ప్రగడ చిట్టి వీరన్న, మిత్రుల సాయంతో రూ. లక్ష అందించారు. చీలివారి పేటకు చెందిన దివ్యాంగురాలు నేమారపు సీతమ్మకు మూడు చక్రాల వాహనం అందించారు. సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, మాజీ జడ్పీటీసీ చుక్కా సాయిబాబు, గ్రామ వైస్ ప్రెసిడెంట్ వడ్డి మార్కండేయులు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు మానే భాస్కరరావు, జనసేన గ్రామ అధ్యక్షులు పసుపులేటి అబ్బులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

ఉండి జూలై 23: బీజేపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయవలసిన అవసరం వుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. మంగళవారం వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో మండల బీజేపీ విస్తృతస్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు యర్రా విక్రమ్ అధ్యక్షతన జరిగింది. తాతాజీ మాట్లాడుతూ ప్రధానిమోదీ పథకాలను ప్రజలలోకి తీసుకుని వెళ్లామన్నారు. పార్టీకోసం పనిచేసిన వారికి గుర్తింపు వుంటుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జు అల్లూరి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

ఉండి జూలై 23: ఉండి మండలంలోని ఒక గ్రామంలో దంపతులు అనారోగ్యంతో ఆర్ఎంపీ వైద్యుడు దగ్గరకు వెళ్తున్నామని చెప్పి వారి ఏడేళ్ల పాపను అదే ప్రాంతానికి చెందిన పాము బాలు(22)కు అప్పజెప్పి వెళ్లారు. పాపతో బాలు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనితో పాప తల్లిదండ్రులు ఆస్పత్రి నుంచి వచ్చిన తరువాత ఏడ్చుకుంటూ వెళ్లి జరిగిన విషయాలను చెప్పడంతో వారు కన్నీరుపెట్టుకున్నారు. పాప తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో కేసుగా నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి కూరగాయలతో అలంకారం



పెంటపాడు, జూలై 23: ఆషాఢ మాసం సందర్భంగా పడమర విప్పర్రులో శ్రీవల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మంగళవారం కూరగాయలతో అలంకరించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందరావు, సొసైటీ మాజీ చైర్మన్ పసల అచ్యుతం, మాజీ సర్పంచ్ పసల చంటి తదితరులు పర్యవేక్షించారు.

నాలుగు సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు

నరసాపురం టౌన్, జూలై 23: పట్టణంలోని నాలుగు సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ శిబిరాలు ఈనెల 27 వరకు సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతాయన్నారు. శ్రీహరిపేట, కోటవద్దపాలెం, గాంధీనగర్, వీవర్స్‌కాలనీ సచివాలయాల్లో నిర్వహించే క్యాంపులో ఆధార్‌కు సంబంధించి తప్పులు సరి చేసుకోవచ్చున్నారు. అలాగే ఆధార్‌కార్డు లేని పిల్లలకు కొత్తకార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతకు ముందు వీవర్స్‌కాలనీలోని సచివాలయాల్లో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ముంపు సమస్యపై ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావన



భీమవరం టౌన్, జూలై 23 : గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పంట కాలువలు, డ్రెయిన్లు తవ్వలేదని, ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. కాలువలు, డ్రెయిన్లు ఆక్రమణలకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడారు. కొద్దిపాటి వర్షం వస్తే చేలు మునిగిపోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే ఇక వ్యవసాయం చేసే పరిస్థితి లేదన్నారు. అభివృద్ధికి చర్యలు తీసుకోకపోతే సాగు కుంటుపడే ప్రమాదం ఉందన్నారు.

డ్రెయిన్ గేట్లు పాడవడం వల్లే ముంపు: ఆరిమిల్లి



తణుకు, జూలై 23: డ్రెయిన్ గేట్లు పాడవటం వల్ల వరదలు వచ్చినపుడు పంట పొలాలు దెబ్బతింటున్నాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో తెలిపారు. వయ్యేరు, యనమదుర్రు డ్రెయిన్‌లలో అప్ స్ట్రీంలో ఉన్న నందమూరు అక్విడెక్టును తొలగించిన తర్వాత డ్రెయిన్ ద్వారా వర్షాకాలంలో వరద నీరు రావడంతో నియోజకవర్గంలోని తణుకు, కోనాల, ముద్దాపురం, దువ్వ, అత్తిలి మండలంలోని వరిఘేడు, తిరుపతిపురం గ్రామాల మీదుగా వెళ్ళే డ్రెయిన్ గేట్లు పాడవుడంతో పలు ప్రాంతాల్లో పంటలు మునిగిపోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం దీనిపై తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు.

పిల్లల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

భీమవరం టౌన్, జూలై 23: పిల్లలు సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చైల్డ్ వెల్ఫేర్ కమిటీని ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె చైల్డ్‌వెల్ఫేర్ కమిటీతో సమావేశమై మిషన్ వాత్సల్య పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని బాలల సంరక్షణకు చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ కృషి చేయాలి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన మిషన్ వాత్సల్య పథకం కింద నిధులు చిన్నారుల ఖాతాల్లో జమ చేసేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమోదించారు.

రైళ్ల హాల్ట్‌లు పునరుద్ధరించాలి

తణుకు, జూలై 23: అత్తిలి రైల్వే స్టేషన్‌లో గతంలో మాదిరిగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్‌లు పునరుద్ధరించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. మంగళవారం విజయవాడలో డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్ కు వినతి పత్రం అందజేశారు. సర్వీసులు అత్తిలిలో ఆగకపోవడం వల్ల అత్తిలి పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించడంతో ఆయన సానుకూలంగా స్పందించారని ఆరిమిల్లి చెప్పారు.

రైతులకు వెంటనే పరిహారం అందించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 23: వరదల వల్ల పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని రైతు సంఘ జిల్లా నాయకుడు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. జగన్నాథపురంలోని ఎర్రకాలువ ముంపు ప్రాంతాలను పరిశీలించిన సంఘాల నాయకులు మంగళవారం సచివాలయం వద్ద ధర్నా చేసి సచివాలయ కార్యదర్శి శ్రీనివాస రెడ్డికి వినతిపత్రం అందించారు.

వరద బాధితుల కోసం వస్తు సేకరణ



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 23: వరద బాధితుల సహాయం కోసం వస్తువులు సేకరించడం 'ఆత్మ బంధువులం' సేవా సంస్థ చిత్తశుద్ధికి నిదర్శనమని వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ పేర్కొన్నారు. పెద్దవాగు కట్టతెగిపోవడంతో నిరాశ్రయులైన 11 గ్రామాలకు చెందిన 800 కుటుంబాల కోసం మంగళవారం వస్తు సేకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎస్‌వీఎస్‌సీ ట్రస్ట్ చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు, ఆత్మబంధువులం సేవా సంస్థ ఫౌండర్ సెక్రటరీ శీతాళం ఉషాకిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేషన్‌ను సద్వినియోగం చేసుకోండి

భీమవరం టౌన్, జూలై 23 : ఆధార్ అప్డేషన్‌కు ఈనెల 23 నుంచి 27 వరకు ఐదు రోజులు పాటు ఏర్పాటు చేసిన ప్రత్యేక మొబైల్ క్యాంపులను జిల్లా ప్రజల సద్వినియోగం చేసు కోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, కాలేజీల్లో ఆధార్ అప్డేట్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు ద్వారా పెండింగ్‌లో ఉన్న ఆధార్ సర్వీసులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు.

శాస్త్రవేత్తలు ముంపు పొలాల పరిశీలన

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 23: ఎర్రకాలువ వరదతో ముంపు బారిన పడిన నందమూరు, ఆరుళ్ల, మారంపల్లి, జగన్నాథపురం, మాధవరం వరి పొలాలను మార్టేరు వరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ పి. సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు రాబోయే పంట తక్కువ కాల వ్యవధి గల రకాలను వేసుకుంటే రబీ పంటకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. నీరులాగిన తరువాత బాగా ఉన్న వరి చేలలో రైతులు బూస్టర్ డోస్ కింద యూరియా, పొటాష్ వేసుకుంటే మంచిదన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై హర్షాతిరేకాలు

రాష్ట్రానికి పెద్దపీట



తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 23: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రయోజనాలకు పెద్దపీట వేసింది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ కృషికి ఇది నిదర్శనం

- తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి వలవల

ఏపీకి పూర్వవైభవం



కేంద్రం రాష్ట్రానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చింది. రాష్ట్రానికి మళ్లీ పూర్వవైభవం రానుంది. అమరావతి అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీతో పొత్తు ఉన్నామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు చెప్పిన మాట ఈ రోజు నిజమైంది. పోలవరం ప్రాజెక్టను వేగవంతంగా పూర్తి చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది.

- కోళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి

రాష్ట్ర పునర్నిర్మాణానికి బడ్జెట్ దోహదం



రాష్ట్ర పునర్నిర్మాణానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని బడ్జెట్ నిధులు కేటాయింపే రుజువు చేశాయి. అమరావతి, పోలవరం నిర్మాణానికి సహకారం పట్ల సంతోషం. వికసిత్ భారత్ లక్ష్యంగా 9 రంగాలలో ప్రాధాన్యం ఇచ్చారు.

- ఉన్నమట్ల కబర్ధి, కృష్ణాజిల్లా బీజేపీ ఇన్‌చార్జి

ఇంత సాయం ఎన్నడూ లేదు



ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో కేంద్ర బడ్జెట్‌లో ఇంత సాయం ఎప్పు డూ పొందలేదు. రానున్న రోజుల్లో ఏపీ బంగారు భవిష్యత్ కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది. చంద్రబాబు పనితీరుకు బడ్జెట్‌లో కేటాయింపే నిదర్శనం.

- గొంట్లా గణపతి, టీడీపీ కస్టర్ ఇన్‌చార్జి

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట



కేంద్ర బడ్జెట్‌లో ఈసారి ఏపీకి పెద్దపీట వేశారు. అమరావతి, పోలవరం, వెనుకబడిన జిల్లాలకు భారీ కేటాయింపులు చేసిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి సీతారామన్‌కు అభినందనలు. సీఎం చంద్రబాబు పనితీరుకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులే నిదర్శనం.

- వినియోగదారుల సంఘాల నేత బంగారయ్య

బడ్జెట్‌లో వరాల జల్లు



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాల జల్లు కురిపించింది రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు భారీ సాయం ప్రకటించడం, పోలవ రం ప్రాజెక్టుకు నిధులు, వైజాగ్ ఇండస్ట్రీయల్ క్యారిడార్‌కు, వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం అభినందనీయం.

- కర్నేన గౌరునాయుడు, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు

కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి వరం



ఉపాధి కల్పన కోసం బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు అధిక మొత్తంలో నిధులు కేటాయింపు, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిధులు కేటాయింపు, విద్యుత్, హైవే రోడ్స్ అభివృద్ధికి నిధులు కేటాయింపు చేయడం రాష్ట్రానికి మేలు జరుగుతుంది.

- ఖంగా సారథి, టీడీపీ సీనియర్ నాయకుడు

రాష్ట్రానికి నిధులు పట్ల హర్షం



అమరావతికి రూ.15వేల కోట్లు కేటాయించటం హర్షం. విభజన తరువాత ఏపీకి కేంద్రం ఈ స్థాయిలో ప్రాధాన్యం ఇచ్చిందిలేదు. వ్యూహాత్మకంగా ఎన్‌డీఏలో చేరటం, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకపాత్ర పోషించటం నిధులు రావడానికి ఎంతో దోహదపడింది.

- కామన రాంబాబు, టీడీపీ బీసీ నాయకుడు

ఇది అన్ని వర్గాల బడ్జెట్



కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల వారికి అనుకూలంగా ఉంది. ఇటు బంగారం, వెండి ధరల తగ్గుదల, సెల్‌ఫోన్‌లపై 15 శాతం కస్టమ్ డ్యూటీ తగ్గించడం, లెదర్ ఉత్పత్తులపై పన్ను తగ్గింపు, క్యాన్సర్ మందులపై జీఎస్టీ తొలగింపు ఆయా వర్గాలకు ప్రయోజనకరం. రాజధాని నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సన్నద్ధంగా ఉండటం శుభపరిణామం.

-నరిసే సోమేశ్వరరావు, బీజేపీ మీడియా అధికార ప్రతిని

అమరావతికి మహర్దశ



రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతికి రూ. 15000వేల కోట్లు నిధులు కేటాయించడం శుభ పరిణామం. అలాగే రాష్ట్రానికి గతంలో లేని విధంగా డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా నిధులు అందించడం జరిగింది భవిష్యత్‌లో అమరావతికి అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పెద్ద పీట వేశారు. ప్రధాన మంత్రి మోదీ గతంలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చినట్టు అయ్యింది. అదే విధంగా వెనుక బడిన జిల్లాలకు నిధులు కూడా కేటాయించడం హర్షణీయం. ఇంకా పోలవరం ప్రాజెక్టుకు నిధులు పెద్దగా కేటాయించడంతో ప్రాజెక్టు పనులు శరవేగంగా జరిగే అవకాశం ఉంది.

- జక్కంపూడి కుమార్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు, పాలకొల్లు



వరద దాటికి వేలేరుపాడు మండలం కమ్మరగూడెం గ్రామం పరిస్థితి..



పోలవరం కడమ్మ స్లూయిజ్ వద్ద వరద జలాలు



దాచారం పునరావాస కాలనీలో భోజన ఏర్పాట్లు



కుక్కునూరు మండలం చివ్వాక ఆయకట్టు ప్రాంతంలో నీట మునిగిన వరినాట్లు

అక్కడ తగ్గి.. ఇక్కడ పెరిగి..

ముంపులోనే పొలాలు.. డ్రెయిన్లకు గండ్లు

అధికారుల నిర్లక్ష్యం.. డ్రెయినేజీ ఈఈపై వేటు

సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి

ముంపు చేలను పరిశీలించిన నిపుణుల బృందం

కొత్తగా సాగు చేసుకోవాలంటూ సూచన

విత్తనాలు సిద్ధంగా ఉంచిన వ్యవసాయ శాఖ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఎర్రకాల్వ వరద పశ్చిమ గోదావరి జిల్లాలో తీవ్ర ప్రభావం చూపంది. తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింది. యనమదుర్రు డ్రెయిన్‌లోకి వచ్చే కాలువలు ఎగదన్నాయి. దాని ప్రభావంతో యండగండి, భీమవరం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. వరద ప్రాంతాల్లో మంగళవారం నిపుణుల బృందం పర్యటించింది. కొత్తగా సాగు చేసుకోవాలని సూచించింది. నాట్లు కనిపిస్తున్నా సరే పంట ఎదిగే పరిస్థితి ఉండదని తేల్చింది. ముంపు వీడిన తర్వాత మళ్లీ కొత్త సాగుకు సిద్ధం కావాలని దిశానిర్దేశం చేసింది. గుంటూరు నుంచి విచ్చేసిన డైరెక్టర్ ఆఫ్ రీసెర్చర్స్ సైతం జిల్లాలో పర్యటించారు. స్వల్పకాలిక రకాలను సాగు చేసుకుంటే జనవరి నాటికి మళ్లీ రబీకి సిద్ధం కావచ్చంటూ వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు చేశారు. ఎంటీయు 1153, ఎంటీయు 1156, పీఆర్ 126 రకాలు మళ్లీ సాగు చేసుకోవాల్సి ఉంటుంది. రాయితీ ద్వారా రైతులకు సరఫరా చేయడానికి వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఆ దిశగా లేఖ రాసింది.

గోస్తనీకి గండి.. ఈఈ సస్పెన్షన్

గోస్తనీ డ్రెయిన్‌కు గండి పడడంతో పాలకోడేరు మండలంలో వేలాది ఎకరాలు ముంపు బారినపడ్డాయి. దానికి డ్రైనేజీ అధికారులు నిర్లక్ష్యం కారణమైంది. గండి పడకుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా డ్రైనేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిశోర్‌ను జిల్లా కలెక్టర్ నాగరాణి సస్పెండ్ చేశారు. సరైన ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే పాలకోడేరు మండలం మోగల్లు వద్ద గోస్తనీ డ్రెయిన్‌కు గండిపడింది.

కలెక్టర్ పర్యటన

గోదావరి వరద పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలకోసం పునరావాస కేంద్రాలను నెలకొల్పారు. జిల్లా కలెక్టర్ నాగరాణి గోదావరి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో గోదావరికి వరద పెరిగే అవకాశం ఉందని అధికారులను అప్రమత్తం చేశారు. విధుల్లో అలసత్వం వద్దంటూ హెచ్చరించారు.



గోస్తనీ డ్రెయిన్‌కు గండి పడడంతో పాలకోడేరులో మునిగిన వరి పొలాలు

వరద తగ్గినా ముంపులోనే గ్రామాలు..చేలు

భద్రాచలం వద్ద గోదారి నీటిమట్టం నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. ఉదయం 51.6 అడుగుల నీటిమట్టం ఉండగా సాయంత్రం 5 గంటలకు 50.9 అడుగులకు తగ్గింది. తెలంగాణ ఎగువ ప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం వరద భయం వీడింది. వరద నీటిని భారీగా దిగువకు విడుదల చేస్తుండడంతో సిద్ధాంతం, ఆచంట, యలమంచిలి తీర గ్రామాలకు వరద నీరు పోటెత్తుతోంది. 15 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవడంతో నరసాపురం వద్ద వశిష్ట గోదావరి ఉరకలు వేస్తోంది.



పడవలపై రాకపోకలు సాగిస్తున్న కనకాయలంక గ్రామస్థులు

శాంతించిన ఎర్రకాలువ

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు.. నీటిలోనే వరి పొలాలు

తగ్గుముఖం పట్టిన వయ్యేరు

తాడేపల్లిగూడెం రూరల్/తణుకు : ఐదు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన ఎర్రకాల్వ మంగళవారం కాస్తంత శాంతించింది. మండలంలోని జగన్నాధ పురం, మారంపల్లి, మాధవరం, వీరంపాలెం, అప్పారావుపేట, పట్టింపాలెం, ఆరుళ్ల గ్రామాల్లోకి చేరిన వరదనీరు వెనక్కి మళ్లింది. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది సూపర్ శానిటేషన్ చర్యలు చేపట్టారు. పంటచేల నుంచి వరదనీరు తగ్గకపోవడంతో వరిపంటపై రైతులు ఆశలు వదులుకున్నారు. మండలంలో సుమారు 1,500 ఎకరాల వరిపంట నష్టానికి గురైంది. వయ్యేరు కాలువ వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. దువ్వ వయ్యేరు అక్విడెక్టు వద్ద ఒకటిన్నర అడుగులు నీటి మట్టం తగ్గి 13 అడుగులకు చేరింది. దీంతో పొలాల్లో చేరిన వరద నీరు క్రమంగా తగ్గుతోంది. తణుకు మండలంలోని ముద్దాపురం, కోనాల, దువ్వ, తేతలి, మండపాక, వడ్లూరు గ్రామాల్లో వరిచేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వంలో మురుగు కాలువలు, పంట కాల్వలు పూడికతీత పనులు చేయక పోవడంతోనే ఇలాంటి దుస్థితి ఎదుర్కొనాల్సి వచ్చిందని పలువురు రైతులు వాపోతున్నారు. మూడు వేల పైగా ఎకరాలు నీటిలోనే మునిగి ఉన్నాయి. నీట మునిగిన ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు సందర్శించారు. అలాగే పునరావాస కేంద్రంలో ఉన్న వారికి అన్ని వసతులు కల్పించారు.



నందమూరు పాఠశాల వద్ద బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

లంక గ్రామాల్లోకి వరద

పడవల్లో రాకపోకలు

నరసాపురం వద్ద వశిష్ట ఉగ్రరూపం

మూడో రోజు రాకపోకలు బంద్

ముందస్తుగా 10 వేల ఇసుక బస్తాలు రెడీ



ఆచంట/యలమంచిలి/నరసాపురం జూలై 23: వశిష్ట గోదావరి మంగళవారం ఉగ్రరూపం దాల్చింది. పెదమల్లం మాచేనమ్మ ఆలయ సమీపంలోకి వరదనీరు చేరుతుంది. ఇప్పటి కే మండలంలో ఉన్న పుష్కరఘాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. వరద పరిస్థితిని తహసీల్దార్ ఐపిశెట్టి , ఎంపీడీవో నరసింహ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు సమీక్షిస్తున్నారు. కనకాయలంక కాజ్‌వే రెండురోజులుగా వరదనీటిలోనే ఉంది. కనకాయలంక గ్రామస్తులు పడ వలలో రాకపోకలు సాగిస్తున్నారు. లంకగ్రామాలైన కనకాయలంక, పెద లంక, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, బాడవ గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం గ్రామాల్లోని పల్లిపాలెం ప్రాం తాల్లో ఇళ్లచుట్టూ వరదనీరు ప్రవేశిస్తోంది. అబ్బిరాజుపాలెం, గంగడపాలెం, బూరు గుపల్లి, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక గ్రామాల్లో లంక భూములు నీట మునిగాయి. నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి 15 లక్షల క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టడంతో ప్రవాహం ఎక్కువగా ఉంది. మూడో రోజు మంగళవారం కూడా ఉభయ గోదావరి జిల్లాల మధ్య రాక పోకల్ని నిలిపి వేశారు. అమరేశ్వర, వలంధర్, బాపుఘాట్‌ల మెట్ల పైభాగం వరకు వరద నీరు చేరింది.పొన్నపల్లి, నందమూరికాలనీలో వరద నీరు వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగా నీటిని తోడేందుకు మోటర్లు ఏర్పాటు చేశారు. నాలుగు రోజులుగా వరద ప్రవాహానికి గట్లు బలహీన పడుతుం డటంతో వాటిని పటిష్ట పర్చేందుకు ఇసుక బస్తాలను సిద్ధం చేస్తున్నారు. ఏటిగట్టు శాఖ అధికారులు ముందుస్తుగా 10 వేల బస్తాలను రెడీ చేసి యలమంచిలి, దొడ్డిపట్ల, కరుగోరుమిల్లి, పీచుపాలెం వద్దకు తరలించారు. ఆర్డీవో అంబరీష్ ఏటిగట్లలను పర్యవేక్షించి అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. తహసీల్దార్ ప్రసాద్, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఈ సుబ్బారావు అయన వెంట ఉన్నారు.



లక్ష్మీపాలెంలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న నరసాపురం ఆర్డీవో అంబరీష్

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో అంబరీష్

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్డీవో అచ్యుత అంబరీష్ సూచించారు. యల మంచిలి మండలంలోని బాడవ, లక్ష్మీపాలెం గ్రామాల్లో, వడ్డిలంక నక్కల అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద వరదపరిస్థితిని ఆర్డీవో పరిశీ లించారు. లంక గ్రామాల్లో భోజన, వసతులు, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్యశిబిరాల వద్ద అన్నిరకాల మందులు, వ్యాక్సిన్‌లు అందు బాటులో ఉంచాలన్నారు. తహసీల్దారు విజయశ్రీ ఉన్నారు.





నరసాపురంలో సిద్ధం చేస్తున్న ఇసుక బస్తాలు దువ్వలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు,రైతులు

గోదావరి తగ్గుముఖం

కుక్కునూరు/వేలేరుపాడు, జూలై 23: గోదావరి వరద మంగళవారం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. ఉదయం భద్రాచలం వద్ద 51.9 అడుగులకు చేరుకుని మధ్యాహ్నం తరువాత వరద ప్రవాహం నిలకడగా ఉంది. సాయంత్రానికి ఒక అడుగు మేర తగ్గి క్రమేపీ తగ్గుతూ వస్తుంది. గోదావరి ముంపుతో చివ్వాక చెరువు ఆయుకట్టు ప్రాంతంలో వరినాట్లు నీట మునిగాయి. పలు గ్రామాల శివారులోకి వరద ముంచుకొచ్చింది. దాచారం, కౌండిన్యముక్తి, కివ్వాక పునరావాస కేంద్రాల్లో ప్రభుత్వ అధికారులు భోజన ఏర్పాట్లు చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య స్థానిక తహసీల్దార్లు, ఎంపీడీవోతో కలిసి పర్యటించారు. బాధితుల కోసం 18 బోట్లు 12 జనరేటర్లు సిద్ధంగా ఉంచామన్నారు. రెండు లాంచీల ద్వారా నిత్యావసర వస్తువులైన కూరగాయలు, వాటర్ ప్యాకెట్లు, టార్పాలిన్లు, దోమల చక్రాలు, కొవ్వొత్తులు, బియ్యం, వరద బాధితులకు పంపిణీ చేశారు. వేలేరుపాడు మండలంలో జల దిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాలకు అధికారులు పడవలు ఏర్పాటు చేయడంతో అత్యవసర సేవలకు ప్రజలు వాటిని ఉపయోగించుకుంటున్నారు. ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులు బియ్యం, కూరగాయలను ఆయా గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. గుట్టలపై గుడిసెలు వేసుకున్న రుద్రంకోట, కొయిదా, చిగురుమామిడి, నాళ్ళవరం, గ్రామాల్లోని ప్రజలకు 500 టార్పాలిన్‌లను పంపిణీ చేశారు.

11.87 లక్షల క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం, జూలై 23 :పోలవరంలో గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి పోలవరంలో గోదావరి నీటిమట్టం 25 మీటర్లకు చేరుకుంది.ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప నదుల నుంచి వస్తున్న వరద జలాలను స్పిల్వే 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం 11,87,497 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఈఈ మల్లిఖార్జునరావు, డీఈ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 33.600 మీటర్లు, స్పిల్వే దిగువన 25.350 మీటర్లు నమోదైనట్లు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 51.20 అడుగులకు చేరు కోవడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరగడంతో 175 గేట్లు ఎత్తి 12 లక్షల క్యూసెక్కుల జలా లను సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద 14.05 మీటర్ల నీటిమట్టం నమోదైందని రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ధవళేశ్వరం బ్యారేజి డీఈఈ రమేశ్ తెలిపారు.

ప్రాజెక్టుకు రాకపోకలు బంద్

భద్రాచలం వద్ద నీటిమట్టం స్వల్పంగా తగ్గుతున్న నేపథ్యంలో పోల వరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. కడెమ్మ స్లూయిజ్ వద్ద భారీ వరద జలాలు నిలిచాయి. పోలవరం ప్రాజెక్టుకి రాకపోకలు సాగించే ప్రధాన మార్గమైన కడమ్మ వంతెన పూర్తిగా నీటమునిగి మూడు అడుగుల ఎత్తున జలాలు ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రాజెక్టుకు రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. ప్రాజెక్టుకి కార్మికులు, అధికారులు రాకపోకలు సాగించేందుకు పాండురంగడి కొండ పక్క నుంచి మూలలంక మీదుగా ప్రత్యామ్నాయ మార్గాన్ని అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.ఏటిగట్టుకి కుడివైపున ఉన్న పంటపొలాల్లో కొండవాగుల జలాలు నిలిచి సుమారు రెండు వేల ఎకరాల్లో వరినాట్లు నీట మునిగాయి.

కొనసాగుతున్న వర్షాలు

కుక్కునూరు మండలంలో 32.8 మి.మీ వర్షపాతం

ఏలూరుసిటీ, జూలై 23: నైరుతి రుతుపవనాల ఉధృతితో జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కుక్కు నూరు మండలంలో 32.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా సరాసరి వర్షపాతం 3.1 మి.మీ నమోదైంది. వేలేరుపాడులో 26.2, పోలవరంలో 4.8, దెందులూరులో 4.2, కామవరపుకోటలో 3.8, నూజివీడులో 2.8, బుట్టాయి గూడెం మండలంలో 2.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మంగళవారం కూడా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.

ముంపులో 5,423 హెకార్లు

భారీ వర్షాలు, వరదల కారణంగా ఏలూరు జిల్లాలో 5,423 హెక్టార్లలో వివిధ పంటపొలాలు ఇంకా నీటి మునిగే ఉన్నాయి. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం 194 హెక్టార్లలో వరి నారుమళ్లు, 5,250 హెకార్టలో వరి నాట్లు వేసిన పంట పొలాలు ముంపులోనే కొనసాగుతున్నాయి. ఐదు హెక్టార్లలో మొక్కజొన్న, 168 హెక్టార్లలో ప్రత్తి పంట నీటి మునిగే ఉన్నాయి. వర్షాలు కురవడం, పంట పొలాల్లో నీరు తీయక పోవడంతో పంటలు కుళ్లి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోదారి వరదలో లచ్చిగూడెం

ఏటా 3 నెలలపాటు కొండగట్టు పైనే జీవనం

గుట్టల పైకి చేరుకుంటున్న గిరిజనులు

ముంపు గ్రామాల జాబితాలో చేర్చండి



గుట్టల పైకి చేరుకున్న లచ్చిగూడెం గిరిజనులు

కుక్కునూరు, జూలై 23: కుక్కునూరు మండలంలో మారుమూల గ్రామం లచ్చిగూడెం. గ్రామంలో 150 గిరిజన కుటుంబాలున్నాయి. ఈ గ్రామాన్ని మూడు వైపులా గోదావరి వరదనీరు చుట్టుముట్టింది. ప్రభుత్వం అందజేసిన టర్పాలిన్లు, కూరగాయలు తీసుకుని గుట్టలపైకి గిరిజనులు చేరుకుంటున్నారు. ఇప్పటికే తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్నారు. అధికారులు గుట్టలపైన జనరేటర్ ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పిం చారు. తాగునీటి కోసం మంచినీటి ప్యాకెట్లు సిద్ధం చేశారు. ప్రతీ ఏటా ఇదే పరిస్థితి. దాదాపు మూడునెలల పాటు గోదావరి వరద తగ్గే వరకు అక్కడే జీవనం. గుట్టలపైనే వండుకుని, వరదనీరే వాడుకుంటూ దుర్భరమైన జీవనం సాగించడం అలవాటుగా మారింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 50 అడుగులకు చేరితే చాలు ఆ గ్రామాన్ని వరదనీరు చుట్టుముడుతుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవిల్‌లో ప్రభుత్వం ప్రకటించిన ముంపు గ్రామాల జాబితాలో లచ్చిగూడెం లేక పోవడం గమనార్హం. ముందే ముంపుకు గురవుతున్న తమ గ్రామం ముంపు జాబితాలో లేకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చి పునరావాస పరిహారం, వ్యక్తిగత పరిహారం చెల్లించి పునరావాస కాలనీకి తరలించాలని కోరుతున్నారు.

ముంపు గ్రామాల్లో చేర్చండి



మా గ్రామాన్ని ముందే వరదనీరు చుట్టుముడుతుంది. ప్రతీ ఏటా ఇదే పరిస్థితి. ఎటు వెళ్ళడానికి కూడా వీలులేని పరిస్థితి. గోదావరి తగ్గిన తరవాత ఇళ్లకు చేరుకుంటున్నాం. పునరావాస పరిహారం చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలి.

- సున్నం అమ్ములు, లచ్చిగూడెం

ఏటా గుట్టలపైనే



ప్రతీ ఏటా వర్షాకాలం సీజన్ వస్తేనే మాకు భయాందోళనలకు గురవు తున్నాం. గుట్టల పైన జీవించే క్రమంలో గ్యాస్ ఉండదు. దీంతో కట్టెల పొయ్యి మీదే వండుకుని తినాలంటే కష్టంగా మారిది. అధికారులు మా బాధ అర్థం చేసుకోవాలి - మచ్చా సుభద్ర, లచ్చిగూడెం

ఉమ్మడి జిల్లా పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీ

ఏలూరు అర్బన్, జూలై 23 :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీని నిర్వహిస్తున్నట్టు మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఓ ప్రకటనలో తెలి పారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై రెండు పేజీలకు మించకుండా వ్యాసం రాసి స్కూలు హెచ్ఎం ధ్రువీకరణతో ఆగస్టు 10వ తేదీలోగా ' కార్యదర్శి, జిల్లా సర్వోదయ మండలి, గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరాంపురం, భీమవరం-2 ' చిరునామాకు పోస్టులో పంపాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చునని తెలిపారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

పెంటపాడు, జూలై 23 : పెయింట్‌లో వాడే టిన్నర్‌ను ఒంటిపై వేసుకుని నిప్పు అంటించుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండ లంలోని ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న గోనా అరుణకుమారి (28) మంగళవారం తన ఇంటి వద్ద ఒంటిపై టిన్నర్ వేసుకుని నిప్పు అంటించుకుంది. ప్రమాదకర పరిస్థితిలో ఉన్న ఈమెను స్థానికులు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందింది. మృతురాలికి భర్త పండు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ రమేష్ పరిశీలించారు.

రైలు ఢీకొని బిహార్ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూలై 23 : రైలు ఆగిందని బిహార్‌కు చెందిన ఒక వ్యక్తి రైలు దిగి టాయిలెట్‌కు వెళ్లేందుకు పక్కనే ఉన్న పట్టాలు దాటుతుండగా మరో రైలు వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బిహార్‌కు చెందిన వినోద్ బహర్‌ద్దార్ (39) బెంగుళూరులో కూలి పనులు చేసుకునే నిమిత్తం బెంగుళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో వెళుతున్నాడు. ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి ఏలూరు నుంచి విజయవాడ వెళ్తున్న ఆ రైలు ఏలూరు సమీపంలోని కలపర్రు రైల్వేగేటు సమీపంలో ఎవరో చైన్ లాగడం వల్ల ఆగి పోయింది.రైలు ఆగింది కదా అని రైలు నుంచి దిగి పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగింది. ఏలూరు రైల్వే పోలీసులు పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. రైల్వే ఎస్ఐ సైమన్ దర్యాప్తు చేస్తున్నారు.



యలమంచిలి లంక గ్రామంలో గోదావరిలో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

గల్లంతైన వ్యక్తి కోసం గోదావరిలో గాలింపు

యలమంచిలి, జులై 23: యలమంచిలిలంక గ్రామంలో సోమవారం ప్రమాద వశాత్తు గోదావరిలో గల్లంతైన పితాని ఆనందరావు (43) కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం గోదావరిలో మంగళవారం గాలింపు చర్యలు కొన సాగించారు.మంగళవారం సాయంత్రం వరకూ గాలించినప్పటికీ ఆచూకీ లభించ లేదు. చీకటి పడటంతో గాలింపు నిలిపివేశారు.

ఇసుక లారీలు సీజ్

జంగారెడ్డిగూడెం, జూలై 23 : ఇసుక అక్రమ రవాణాపై పలు చోట్ల పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని దేవులపల్లి గ్రామం వద్ద లక్కవరం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వాడపల్లి ఇసుక ర్యాంపులో ఇసుక లోడు చేసుకుని వారి దగ్గర ఉన్న వే బిల్లుల ప్రకారం ఒక లారీ గోపాలపురం మండలం రేగులగుంట వెళ్ళాల్సి ఉండగా మరో లారీ తాళ్లపూడి మండలం కొవ్వూరుపాడు వెళ్ళాలి. చింతలపూడి వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు.లక్కవరం ఎస్సై టి.సుధీర్ కేసు నమోదు చేశారు.



కమ్మరిగూడెం గ్రామస్థులకు సహాయం అందిస్తున్న రిటైర్డ్ ఎంఈవో జగన్మోహన్‌రావు, ఉపాధ్యాయులు

కమ్మరగూడెం వరద బాధితులకు ఉపాధ్యాయుల సాయం

లక్షా 50 వేలు విలువైన బియ్యం, నిత్యావసరాలు పంపిణీ

వేలేరుపాడు, జూలై 23: పెదవాగు ప్రాజెక్టుకు గండిపడటంతో ప్రాజెక్టు దిగువనే ఉన్న గ్రామం కమ్మరగూడెం గ్రామం పూర్తిగా ధ్వంసమైంది. సర్వ స్వం కోల్పోయిన ఆ గ్రామస్థులకు ఉమ్మడి రాష్ట్రంలో ఇక్కడ పనిచేసిన అప్పటి ఎంఈవో జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యాయులు కలిసి సుమారు లక్షా 50 వేల విలువైన బియ్యం, దుస్తులు, కూరగాయలు, నిత్యావసర సరుకులు, 30 వేలు నగదు అందించారు. మంగళవారం ఆ గ్రామానికి ట్రాక్టర్ల మీద అతి కష్టంగా వెళ్లి 250 కుటుంబాలకు వీటిని అందించారు. ఉపాధ్యాయులు హరి బాబు, కృష్ణారావు, సిద్దూ, రవిబాబు, జగదేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంక టేష్, నాగలక్ష్మి, రోజాకుమారి, నోబుల్, విజయ్‌కుమార్, నరేష్ ఉన్నారు.